కథానిక

# వెన్నెల రాత్రి

"భాస్కరభట్ల"

వెలుపల పాలవెన్నెల కురుస్తున్నది.

నేను జాగ్రత్తగా గది కిటికీలన్నీ మూసి, పక్క మీద మేనువాల్చి, ఏదో ఆలోచిస్తూ పడుకున్నాను.

ఇంతలోకే బాబువచ్చి, "బాబాయి, బాబాయి. కిటికీలన్నీ చందురుణ్ణి చూడనివ్వకుండా ఎందుకు మూశావు" తలవని తలంపుగా అడిగాడు.

చంద్రుడినిగాని, వెన్నెల్నిగాని చూస్తే నాకు భయమని ఎల్లాచెప్పను? "చలిగావుంది బాబూ. అందువల్ల కిటికీలు మూసివేసా"నని బొంకి తప్పించుకున్నాను. చంద్రకిరణాలు ప్రసరించని బాబు ఉక్కిరిబిక్కిరైనాడు. వెంటనే తల్లిదగ్గరికి, విడిచిన తన చొక్కాని బండికిమల్లే లాగుతూ వెళ్ళిపోయినాడు. ప్రపంచాని కంతటికీ ఆనందాన్నిచ్చే వెన్నెలకి దూరమై, దాదాపు యిరువయి సంవత్సరాలు దాటాయి. చీకటిలో జీవితం గడిపి చీకటినే ప్రేమించడం నేర్చుకున్నాను. వెన్నెలని చూస్తే, నాకు వెంటనే గుండెల్లో దడ ప్రారంభమవుతుంది. శరీరం కంపర మెత్తుతుంది. మెదడులో పాములు జెర్రెలు పరుగెత్తుతాయి.

ఎక్కడ చూచినా, రక్త పింజెరలు, నెమ్మదిగా నా వేపు పాకుతూ వస్తున్నట్లు కనపడుతాయి, కొన్ని రక్త పింజెరలు లోపలి వేపు ఇంటి కప్పుపైన పాకుతూ, పట్టువదిలి చల్లగా నా శరీరంపైన పడుతాయి. నేను అమాంతంగా పక్కకి దూకుతాను. కాలు రక్త పింజెరపైన పడుతుంది. శరీరంపైన ఇంకొక రక్త పింజెర, పట్టువదిలి పడుతుంది. శుతి చలించి, కెవ్వున కేకవేసి, నేను రక్తపింజెరల పైన పడుతాను. అవి చితికిపోతాయి. అంతే ఆ తరువాత ఏమీ జ్ఞాపకం ఉండదు.

ఈ యమయాతన పడడానికి బదులు, జీవితంలో వెన్నెలతో తెగతెంపులు చేసుకున్నాను. చీకటిని వరించి, ప్రేమించి, చీకటిలోనే, చీకటితో కాపురం చేయడానికి నిశ్చయించుకున్నాను.

దీనికంతటికీ, కారణమేమిటని మీరు అడుగవచ్చు. నా భీరుత్వానికి మీరు నన్ను అవహేళన చేయవచ్చు. అదిగో, అప్పుడే మీరు నా పిరికితనాన్ని చూచి నవ్వుతున్నారు. వెన్నెల్ని చూచి భయపడటమేమిటని, గొల్లుమంటున్నారు. తొందర పడకండి. నా జీవిత గాథ సావధానంగా వినండి. అప్పటికీ మీకు నవ్వువేస్తే నవ్వండి, అవహేళన చేయడం సమంజసంగా తోస్తే, అవహేళన చెయ్యండి అంతేకాని వినకుండా గొల్లుమనకండి.

అది వెన్నెలరాత్రి. ఆ వెన్నెలరాత్రి నా జీవితంలో నేను ఎప్పుడూ మరిచిపోలేను. ప్రపంచమంతా వెన్నెల దుప్పటి కప్పుకొని నిశ్శబ్దంగా పడుకుంది. ఎక్కడా గురకలులేవు, ఆవలింతలు లేవు మత్తుమందు చల్లినట్లు, సకల ప్రాణికోటి నిద్రిస్తున్నది. ఎక్కడా చెట్లపైన ఆకులుకూడా కదలడంలేదు. ఎందుకో, ఆ రోజు నాకు నిద్రపట్టలేదు పక్కమీద దొర్లుతూ కాలక్షేపం చేస్తున్నాను. రాత్రి దాదాపు రెండు గంటలైవుంటుంది. ఇంట్లో అందరూ పడుకున్నారు. నా కేమీతోచ లేదు. పక్కమీదినించి లేచి వెన్నెల్లో కూర్చుందామని దొడ్డితలుపు తీసాను. వేప ఆకుల్లోంచి వెన్నెల రూపాయి బిళ్ళల్లా పడుతున్నది. ఆ రూపాయి బిళ్ళలని చూస్తో, దొడ్లో కూచున్నాను. ఇంతలోకే ఏదో అలికిడైంది. నేను లక్ష్యం చేయలేదు. మచ్చుమందు ప్రభావం క్రమంగా తగ్గిపోతున్నదేమో ననుకున్నాను. గోడ అవతల ఏదో ప్రాణి మేల్కొని వుంటుంది. అదుగో. ముంగురులు కనపడుతున్నాయి పర్వతాలు, అరణ్యాలు, సముద్రాల వెనకాల ఉదయించే చంద్రుడికి మల్లే గోడచాటునించి ఒక మొహం, పైకి లేచింది. నాకు అమాంతంగా గుండెదడ ఆగిపోయింది. భయంతో శరీరం కంపరమెత్తింది,

ఒక మానవాకారం గోడమీదికి పాకి, లోపలికి దిగుతున్నది. తెల్లని చీర, ఎర్రటి అంచు తెల్లని

పట్టురవిక. నొసట ఎర్రని కుంకుమ. దూరంగా వెన్నెలలో మొహం పోల్చుకోలేక పోయాను. తెల్లనిచీర నా వేపు నడిచివస్తున్నది. కుంకుమ బొట్టు: పాల వెన్నెలలో అరుణకాంతుల్ని విరజిమ్ముతున్నది. కనుచూపు మేరలోకి వచ్చేసరికి తెల్లచీర సిగ్గుతో తల వాల్చుకుంది ఎవరు? మా పక్కింటి అమ్మాయి లక్ష్మి. నా కళ్ళని నేనే నమనలేక పోయినాను. నేను ప్రేమించి, కామించిన లక్ష్మి చివాలున గంతువేసి, నా లక్ష్మిని నా బాహువుల్లో బంధించి ఉక్కిరిబిక్కిరి చేసాను. లక్ష్మి ఇంక సందేహంలేదు. పాము ఆకారంలో లక్ష్మి నొసటి బొట్టు జిగేలుమంటున్నది. ఎందుకో, ఆ వళ్ళు తెలియని ఆవేశంలో, ఆ బొట్టుని ముద్దుపెట్టుకున్నాను. ఆనందపారవశ్యానికి లక్ష్మి బుగ్గలు, సొట్టలు పడ్డాయి. ఆ సొట్టల్లో వెన్నెల నీళ్ళు నిండుకున్నాయి. ఆ వెన్నెల గుంటల్ని తనవితీరా ముద్దుపెట్టుకున్నాను. నా శరీరమే వెన్నెలగామారి, లక్ష్మి శరీరాన్ని పెనవేసుకున్నది. ఇంక ఆ రాత్రికి నాకు, వెన్నెల, లక్ష్మి, వేపచెట్టు, మిగిలిపోయినాయి. ప్రపంచంలోని తక్కినవస్తువులన్నీ కళ్ళల్లోంచి అదృశ్యమైనాయి. ఆ తరువాత నాకు వెన్నెలలు, వెన్నెల రాత్రులు మాత్రమే మిగిలాయి. సూర్యుడు ఉదయిస్తున్నదీ, అస్తమిస్తున్నదీ నాకు తెలియదు. వెన్నెల వస్తుంది. వెన్నెలతో, వెన్నెలలో, వెన్నెలబాల తెల్లటి చీరతో ఆడుకుంటాను. అంతే, పక్షం రోజులు గడిచాయి. వెన్నెలతో మేమూ ఉదయించేవాళ్ళం. వెన్నెలతో మేమూ అస్తమించేవాళ్ళం. ఆరోజు ఇక వెన్నెలకు ఆఖరు రోజు. రేపటినించీ, నేను రాలేను నాకు చీకటి అంటే భయమని, నా వొళ్ళోని వెన్నెలబాల పలికింది. నాకు నిలువునా ముచ్చెమటలు పోశాయి, పెదిమలు బెంగతో, ఆ వెన్నెల కాంతిలో ఎండిపోయినాయి.

"నేను ఉన్నానుగా నీకేమి భయమని" నచ్చజెప్పాను.

లేదు. నేను చీకటిలో ఇంటివెలుపలికి రాలేనని నా వెన్నెలబాల నిక్కచ్చిగా చెప్పింది. ఆ తరువాత పదిహేనురోజులు నా జీవితంలో చీకటి వెలిసింది. అప్పట్లో ఒక్కసారి అయినా కాలకృత్యాలకు తప్ప గది వెలుపలికి రాలేదు. చీకట్లతో చెలగాటం ప్రారంభించాను. చీకటికి సన్నిహితం కావడం మొదలెట్టాను. రాత్రిళ్ళు గదిలో దీపం పెట్టుకునే వాణ్ణికాను. చీకటి ముసుగుతో, సందె చీకటిలో పక్కపైన మేను వాల్చేవాడిని తెల్లవారిందీ, మధ్యాహ్నమైందీ, చీకటిపడిందీ, ఆ ఐచ్ఛిక ప్రవాసంలో తెలియకపోయేది. జీవితంలో చీకట్లతరువాత వెన్నెలలు విరిసేవి. వెన్నెల తరువాత చీకట్లు మూగేవి. జీవితానికి చీకట్లు, వెన్నెలలు, కొండగుర్తులుగా మారాయి.

రోజులు, మాసాలు, వెన్నెలలు, చీకట్లమధ్య గడిచిపోతున్నాయి. వెన్నెలబాల, చీకట్లలో కనపడక పోవడం ఆశ్చర్యంగా తోచేది. చీకటి అంటే నిజంగా భయమేమో పోనీ, నేనే చీకట్లల్లో, గోడదాటి ఆ యింటికి వెడితే? వెన్నెలబాలతో ఆ సంగతి అడిగి చూచాను. వద్దు, మా ముసలమ్మ, రాత్రిళ్ళంతా మేల్కొని వుంటుందని చెప్పింది, దానితో, నాకు చీకట్లు, చీకట్లుగా నిలిచాయి. వెన్నెలలు, చీకట్లమధ్య మరికొన్ని మాసాలు గడిచాయి.

ఒకరోజు ఉదయం అమ్మ, నా గదిలోకి కాఫీ తీసుకొచ్చింది. కాఫీ చల్లారుస్తూ "ఏరా! రోజుకు రోజు అల్లా చిక్కిపోతున్నావు!" అని అడిగింది. అప్పట్లో నాకవి చీకటి రోజులు. చీకటి రోజుల్లో, బెంగతో చిక్కిపోయినానేమోనని, నేను మెదలకుండా వూరుకున్నాను. ఆ తరువాత, మా యింట్లో అందరూ, నన్ను, చిక్కిపోతున్నావని అనడం పరిపాటి అయిపోయింది. గొర్రెదాటు జనం, ఒకరు చిక్కిపోతున్నావంటే, మిగిలిన వారంతా శ్రుతికలిపి, "చిక్కిపోతున్నావు, చిక్కిపోతున్నావు" అని స్వరమేళతో పలకడం సహజం. ఆ మాటల్ని నేను ఎన్నడూ లక్ష్యం చేయలేదు.

నా ధ్యాస అంతా, ఆరోజుల్లో ఒక్క వెన్నెలబాలపైననే కేంద్రీకరించి వుండేది! ఇతరమేమీ నాకు కనపడేదికాదు. కాగా అది నా ప్రేమప్రభావమని గర్వించేవాడిని.

చీకట్లు, వెన్నెలలమధ్య మరి మూడుమాసాలు గడిచాయి. ఒకరోజు ఉదయం, నేను పెరట్లో

మొహం కడుక్కుంటున్నాను. అమ్మ తన ధోరణిలో, "లక్ష్మితల్లికి పక్షవాతంవచ్చింది. పదిహేను రోజులైంది, పట్నంతీసుకెళ్ళా"రని ఆరోజు ఉదయమేవచ్చిన మా అమ్మమ్మకు చెబుతున్నది.

రోజూ నేను అవి వెన్నెల రాత్రులు కావడంవల్ల, లక్ష్మిని కలుసుకుంటూనే వున్నాను. కాని ఆ సంగతి లక్ష్మి నాకెన్నడూ చెప్పలేదు.

"లక్ష్మి ఇక్కడేవుందా?" అని అమ్మమ్మ అడిగింది.

"నీదంతా విచిత్రం, తల్లి చావుబతుకుల్లో వుంటే లక్ష్మి ఇక్కడ ఎందుకు వుంటుందని?"అమ్మ అమ్మమ్మని ఎదురు ప్రశ్న వేసింది.

గడచిన ఎనిమిదిరోజులనించీ, రోజూ లక్ష్మి నన్ను కలుసుకుంటున్నది. వీళ్ళకేమైనా మతులు పోలేదుకదా అని నాకు ఆశ్చర్యమేసింది.

"లక్ష్మి ఇక్కడే వున్నట్లుందే. నిన్న సాయంత్రము కనపడినట్లు జ్ఞాపకం."

"అమ్మతోపాటు నీకుకూడా మతిపోయిందేమిటిరా?"

ఆ ప్రశ్నకు నేనేమీ సమాధానం చెప్పలేదు. ముళ్ళమీద కూర్చొని రాత్రికోసం ఎదురు చూచాను. హృదయంలో ఒకవిధమైన ఆందోళన, భయం లక్ష్మితల్లినిగూర్చి ప్రారంభమైంది. తల్లితో వెడితే. మొదటి ఎనిమిదిరోజులు వెళ్ళిఉంటుంది. ఆ తరువాత వచ్చేసివుంటుందనుకున్నాను. ఈరోజు ఉదయమే, "కుర్రవాడు ఎందుకో పాలిపోతున్నాడేమిటే"అని మా అమ్మమ్మ అమ్మని అడగటం విన్నాను. నిజంగా పాలిపోతున్నానేమోనని అనుమానంవేసి, అద్దంలో మొహంచూచుకున్నాను. పాలిపోవడం ఏమిటో తెలియలేదు కాని, కళ్ళు లోపలికి పీక్కుపోయినట్లు కనపడ్డాయి. రాత్రిళ్లు నిద్రలేకపోవడంవల్ల కళ్ళు లోపలికి పీక్కుపోయినవని, నాకునేనే సమాధానం చెప్పుకున్నాను.

వెన్నెల వచ్చింది, వెళ్ళి దొడ్లో కూర్చున్నాను. గోడవెనకాలనించి చంద్రుడు ఉదయిస్తున్నాడు. ఉద్రేకంగావెళ్ళి చంద్రుడిని శరీరంతో కప్పేశాను. "మీ అమ్మకి జబ్బుగావుంటే నాతో చెప్పలేదేం?" అని లాలనగా తల పైకెత్తి అడిగాను-ఎందుకో నొసటిలోని పాము రక్తవర్ణంతో బుసలుకొట్టినట్లు తోచింది.

భ్రమ వట్టిభ్రమ-బొట్టు ఎక్కడైనా బుసలు కొడుతుందా? వెన్నెల బాల సమాధానం ఏమీ చెప్పలేదు. పొరపాటు జరిగింది క్షమించండి అన్నట్లు నా కళ్ళలోకి చూచింది. నెమ్మదిగా వెన్నెలబాలను, వేపచెట్టు నీడల్లోకి తీసుకెళ్ళాను. ఎందుకో ఆ రోజు ఎక్కడా వేపచెట్టుకింద వెన్నెల చిలకరించలేదు. ఆ నీడల్లోకి వెళ్ళడంతోనే వెన్నెల బాల ఎందుకో నాచేతుల్లోంచి తప్పించుకొని వెన్నెలలోకి వచ్చేసింది. ఎందుకల్లా వచ్చేశావు అని అడిగితే, నాకు నీడలు, చీకట్లంటే భయమని చెప్పింది. ఆ రాత్రి తిరిగి మేము వేపచెట్టు కిందికి వెళ్ళలేదు. వెన్నెల్లోనే కాలక్షేపం చేసాము. ఉదయం లేచీలేవడంతోనే "లక్ష్మి ఇక్కడ లేదన్నావు, ఇక్కడే వుందికదే"అని మా అమ్మతో అన్నాను. "పదిహేను రోజులనించి వాళ్ళ యింటికి తాళంవేసివుంటే, లక్ష్మి ఇక్కడ వుండటమేమిటిరా?"అని అమ్మ ఎదురుప్రశ్న వేసింది.

"ఈమధ్య వచ్చి ఉండగూడదా?"

"నేను చెబితే నీకు నమ్మకంలేదు. నువ్వే వెళ్ళి ఆ యింటికి తాళం వేసివుందో లేదో చూచిరా!"

నాకు శరీరంపైన బిందెడు చన్నీళ్ళు పోసినట్లయింది. ఆపాదమస్తకం వణుకుతూ, లక్ష్మియింటికి వెళ్ళాను. యింటికి తాళంవేసి వుంది. నాకళ్ళని నేనే నమ్మలేక పోయాను. భయంతో శరీరం వణకడం, సలసల కాగడం మొదలెట్టింది. జ్వరమొచ్చినట్లు తోచింది. ఆ జ్వరంతోనే యింటికి తిరిగి వచ్చాను. ఎన్నిగొంగళ్లు, రగ్గులుకప్పుకున్నా చలి ఆగలేదు.

ఆనాడు కూడా వెన్నెలరాత్రే. గది కిటికీలు మూసిలేవు. అమ్మ నా పక్కనే పడుకొనివుంది. కిటికీలోంచి ఎందుకో నేను వెన్నెలవేపు చూచాను. కిటికీకి అవతల వెన్నెలబాల వెలిసింది. నేను ఆమెను చూడటంతోనే, కెవ్వున కేకవేసాను. అమ్మ చప్పున మేల్కొని "ఏమిటి, ఏమిటి" అని అడిగే లోపున అదృశ్యమైంది. నాకు స్మారకంతప్పింది. అపస్మారక స్థితిలో, కిటికీవేపు చూతునుకదా, వెన్నెలబాల గొల్లున నవ్వుతున్నది. వెన్నెలలోకి రమ్మని నన్ను ఆహ్వానిస్తున్నది. నేను భయంతో, రగ్గుకప్పుకోడానికి ప్రయత్నిస్తుండగా, ఆమె నొస

ట్లోనిపాము రక్తపింజెరగా మారింది. అది వందలాది రక్తపింజెరలను సృష్టిస్తున్నది. గదినిండా రక్తపింజెరలు వికటాట్టహాసం చేస్తున్నాయి. శరీరంపైన పైనుండి పడుతున్నాయి. చేతులపైన కాళ్ళపైన, కడుపుపైన పాకుతున్నాయి. మెడపైనపాకి గొంతు నులిమివేస్తున్నాయి. మెదడులో ప్రవేశించి నా స్మృతిని నాశనం చేస్తుండగా "అమ్మా ఆ కిటికీ తలుపులు వేసెయ్యి"మని గట్టిగా చీత్కారం చేసాను. అంతే—ఆ తరువాత ఏమిజరిగిందో నాకు తెలియదు.

అది మొదలు నాకు వెన్నెలంటే, భయం. చీకటిరాత్రుళ్ళలో ఏమీ భయంలేకుండా ఎక్కడికి పడితే అక్కడికి వెడతాను. కాని వెన్నెల రాత్రుళ్ళలో చీకటి పడడంతోనే, గదిలోంచి ఎక్కడికీ కదలను. పైగా వెన్నెలని కూడా గదిలోకి చొరనివ్వకుండా, కిటికీతలుపులన్నీ బంధించివేస్తాను.

---

స్కెచ్

# చీకటిచారలు

"రావు"

సన్నని దీపపు కాంతిలో చేతి వాచీ చూసుకున్నాను. రెండు గంటలయింది. భయంకరమయిన నిశ్శబ్దం అలుముకొంది యిల్లంతా. కటిక చీకటికంటె దారుణంగా ఉంది ఆ నిశ్శబ్దం. ఏదో ఆలోచిస్తూ పడకకుర్చీలో కూర్చున్నాను ఆలోచనలు ఒక్క బద్దెమీద నడవ్వ. ఏమిటో ఆలోచించానో ఇప్పుడు చెప్పాలంటే కష్టపడతాను. అంతూపొంతూలేని రకరకాల ఆలోచనలు. ఎందుకో ఆవేదన. భయం. సంతోషంలా ఉండే అనుభూతి. బాధపడ్డానా? సంతోషించానా?—ఏమీ చెప్పలేను. మత్తుమందు మింగినవాడిలా కూర్చున్నాను. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఆగిఆగి ఉప్పెనగా వస్తున్న భయానకమైన మూలుగులు లోపల. మనస్సు వికలమైంది. ఒంటరితనం అసలే భరించలేకుండా ఉన్న నాకు బాధను కలిగించే మూలుగులు మరికొంత కలతపరచింది.

రెండున్నర.

ఎంత మంచి గంట! ఇల్లంతా ఒక్కమాటు మారిపోయింది! సంతోషంతో కిలకిలలాడింది ఇల్లు! గుడ్డిదీపం గ్లాసులైటు వెలుగు తెచ్చిపెట్టింది. సంతోషంతోకూడిన గాద్గదస్వరంతో అమ్మ అంది ఇవతలకొచ్చి. "అబ్బాయి! మగపిల్లాడు" అమ్మ మొహంకేసి చూశాను ఆ దీపం కాంతిలో-సంతోషంతో తొణికిసలాడింది అమ్మ మొహం! అమ్మకోసం నవ్వాను. అదైనా గట్టిగా కాదు చిన్నగా, మరీ చిన్నగా నవ్వాను. చిరునవ్వులాటిది! అమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

నేను ఒక తండ్రిని! 'హు' అన్నాను అప్రయత్నంగా. అది నవ్వుగా ఉంటుందేమో మిగతా వారికి. కాని చాలా పేలవమయింది. మిగతా రాత్రి అంతా జాగారంచేసాను. నిద్రపోవాలని లేదు. కాదు. నిద్రరాదు. ఇంతవరకూ భరించలేని కటిక చీకటి. భయంకర నిశ్శబ్దం. ఇప్పుడు పట్టలేని సంతసం. కట్టలు తెంచుకొని పరుగులెత్తినది ఉత్సాహం!

ఉదయాన్నే నడిబజారున నడుస్తున్నాను పోష్టాఫీసువైపు. అనేక కార్లు చిన్నవి, పెద్దవి దూసుకుపోతున్నాయి.గడ్డాలుపెంచిన 'బూచాళ్లు' కూడా నడుస్తున్నారు. ఈ 'మాయ' అంతా వెలుగుచీకట్ల కలయిక అనుకున్నాను. శరీరంను దాచుకోవడానికి వీలులేని చింకి పేలికలు కట్టిన ముష్టిదాన్ని చూసాను. పసిడిలా మెరుస్తున్న దబ్బపండు రంగులో 'స్పాంజి'లా ఉబికిన మెత్తని శరీరాన్ని బయటపెట్టడానికి ఉరకలు వేస్తున్న సన్నని వాయిలుచీర కట్టిన ఒక 'అదృష్టపు జాతి తాను' లోని 'ఒక ముక్క'నూ చూశాను. బీద, సంపదా పడుగు, పేకలుగా అల్లిన నేతగుడ్డ యీ ప్రపంచం అనుకున్నాను.